చిట్టి కథ

# త్రిల్

"సార్! ఈ లెటర్ని మా అక్క మీకిమ్మంది."

చేతిలో వున్న ఏదో డిటెక్టివ్ నవల్లోంచి ఓ అందమైన గులాబీ రంగు కాగితాన్ని ఇటూ అటూ భయంగా చూస్తూ దొంగచాటుగా తీసి యిచ్చి, వచ్చినంత హడావుడిగానూ చెప్పాడా అబ్బాయి. సుమారు పద్నాలుగు, పదిహేనేళ్ళుండవచ్చు ఆ అబ్బాయికి!

"అక్కా! అంటే....?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు ప్రతాప్.

"అదిగో....ఆ ఎదురు డాబాలో వుంటూందే.... ఆమె!"

"నిజంగా!" వెంటనే ప్రతాప్ కళ్ళు మెరిశాయి....చేతులు ఆత్రంగా అందుకున్నాయా లేఖను. తన పని ముగించి, దొంగచాటుగానే తనుమరుగయ్యాడా అబ్బాయి తన బాధ్యత అంతటితో తీరినట్టుగా!

చెట్టు చాటుకుపోయి ఓసారా లెటర్ని ముద్దు పెట్టుకుంటూ, పదిలంగా దాన్ని విప్పాడు ప్రతాప్.

"డియర్!

మీరెవరో నాకు తెలియదు. కాని, మీరు మా యింటి ఎదురుగా ఉన్న చెట్టుక్రింద క్రమం తప్పకుండా నిల్చోవడం మొదలెట్టిన తొలినాడే నా మనసు మీ వశమైంది. కాని మీ ఊరు, పేరులు తెలియవు నాకు. మన ప్రేమ ఫలించే మార్గాన్ని మీరే ఆలోచించండి. ఇంతకుమించి నేనేం చేయగలనో నా కర్థం కావడంలేదు.

ఇట్లు,

మీ ఎదురుడాబా అమ్మాయి."

పేరు తెలియజేయని ఆ అమ్మాయి గడుసుతనానికి నవ్వుకుంటూ, లేఖలోని అక్షరాలు అందంగా లేకున్నా ఆ అమ్మాయి అందచందాలతో ఆ లోటును సరిపుచ్చుకుంటూ, లేఖలోని ప్రేమామృతాన్ని పదేపదే గ్రోలుతూ మురిసిపోయాడతను.

కొద్ది క్షణాల అనంతరం తన కర్తవ్యం గుర్తు వచ్చి, వెంటనే రూమ్‌కి చేరుకొని, ఓ పాతిక కాగితాలు తగలేసి, ఇరవై ఆరో కాగితంలో కాబోలు తన లేఖను వ్రాయగలిగా డిలా....

"డియర్ ఎదురుడాబా అమ్మాయికి!

రేపు సాయంత్రం అయిదున్నర గంటకు 'ఫలానా' పార్కుకి వస్తారని వేయి కళ్ళతో.... ఎదురుచూస్తుంటా!

మీ....

చెట్టుక్రింది అబ్బాయి."

మర్నాడు ఉదయం అదే చోట చేరి అదే అబ్బాయి కనిపించేంతవరకూ చూసి, ఆ లెటర్ని అందజేసాడు ప్రతాప్.

మర్నాడు సాయంత్రం అయిదున్నరకు వేయి కళ్ళున్న డిజైన్ గల షర్ట్ వేసుకుని మరీ ట్రిమ్‌గా తయారై పార్కుకి వచ్చిన ప్రతాప్ ఊహకు విరుద్ధంగా....అక్కడ ఎదురుడాబా అమ్మాయి వలపు చూపుల బదులుగా, నలుగురు దుష్టపాత్ర ధారుల్లాంటి దుడ్డుకర్ర ధారులు ఎదురై ప్రతాప్ శౌర్య ప్రతాపాలను పరీక్షింపబోవటంతో, విస్మితుడయ్యాడు ప్రతాప్.

రెండ్రోజులు పోయాక, ఒంటినిండా గాయాలతో, వాటికి కట్టిన కట్లతో....గ్రహాంతర యాత్రికుడిలా హాస్పిటల్ నుండి వస్తూ ఆ డాబా దాటుతూండగా ఆ అబ్బాయి మళ్లీ ఎదురయ్యాడు అతడికి అతడ్ని చూసి సందేహంగా ఓ క్షణం ఆగిన ప్రతాప్‌కి మరో లేఖ నందించాడా అబ్బాయి.

విప్పి అక్కడి కక్కడే చదివాడు ప్రతాప్.

"ఎలా వుంది సార్ ఒళ్లు? క్షమించాలి! నాకు అక్కలు అస్సలు లేరు. ఆ ఎదురుడాబా ప్రక్క పెంకుటిల్లు మాది! ప్రక్కింటి అమ్మాయి కోసం ప్రతిరోజూ మీ 'చెట్టుక్రింది పాట్లు' చూస్తూంటా! నాకు డిటెక్టివ్ కథలన్నా, అందులోని 'త్రిల్స్' అన్నా చెప్పలేని యిష్టం. మీరు ప్రతిరోజూ వూరికే అలా చెట్టుక్రింద పడిగాపులు కాయటం నాకేం 'త్రిల్' అనిపించటంలేదు. మొన్న నేనే వ్రాసిన లెటరుకు మీ సమాధానం అందంగానే ఆ అమ్మాయి వాళ్ళ నాన్నగారికి మీ లెటర్ని పదిలంగా అందజేయగలిగాను. ఇంతే సంగతులు. సారీ....!" అని వుందందులో.

తిరిగి చూసిన ప్రతాప్‌కి చుట్టు ప్రక్కల ఆ అబ్బాయి జాడ కనిపించలేదు.

—ఎస్. వి. రమాదేవి

